# ఎంగిలోడు

వోడు మంచి వొడ్డూ పొడుగూ వుండేటి వొయిసు కుర్రోడు, సిన్నప్పుట్నుంచీ రమాదేవమ్మ అనే రెడ్డెమ్మ ఇంట్లో పనీ బాటా జాస్తా ఆ రెడ్డెమ్మ పశువుల్ని గాస్తుండినాడు. ఆ మాతల్లి వోడికి యాళకింత కబళం బెట్టి పదీ పరకా డబ్బులు సేతికి ఇస్తుండేటిది.

ఇంకెవుడూ పనోడే దొరకనట్టు ఇట్టాటోడినే ఏంవిటికని ఆ రెడ్డెమ్మ పన్లో బెట్టుకోనుండాద్యా అని అర్థం గాకుండా వుండాది ఊళ్లో మనుసులకి. ఆ మాటే ఆంవితో అంటే, వోడు మాత్రవూం మనిసి గాదా..? రేపు తెల్లార్తే మన బతుకులు యేవాటానుంటాయో ఎవురికి దెలుసో అనేది.

అందుర్లాగా కూట్లో కూరాకు గలుపుకోని తిన్లేడోడు. రెడ్డెమ్మే కూడు గలిపి గిన్నిలో యేసిస్తే, రొండు సేతల మిందా ఆ గిన్ని బెట్టుకోని పసువులసాల్లో కెత్తకపొయ్యి కుక్క గెతికినట్టు గెతకతా తినేటోడు.

వోడితో ఎవురూ మాట్లాడరు, వోడు గూడా ఎవుర్తో మాట్లాడడు. వోడికి ఎవురు ఆ పేరు బెట్నారో దెలీదు గానీ ఊళ్లో అందురూ ఎంగిలోడు అనే దోడ్ని. రెడ్డెమ్మ వొక్కటే వోడ్ని వొరే సుదాకరా అంటా బిలస్తుండేటిది.

పొద్దన్నే సద్దినీళ్లు దాగి, ఇంత కూడు సత్తు టిపన్లో బెట్టిచ్చుకోని పసువుల్ని సిట్టడివికి దోలకపొయ్యి సందేళకి ఎనిక్కొచ్చి రేతిర్లు రెడ్డెమ్మోళ్ల పశువుల సాల్లోనే బడుండేటోడు.

• • •

వొకరోజు మజ్జానం బడెగ్గొట్టి నేనూ మా పక్కింటి ఇనోదూ బిళ్లంగోడు ఆడుకొనేదానికి సొర్నముకి ఏటమ్మిడికి పోతుణ్యాం.

గట్టు కింద యాపసెట్టు మొదుట్లో జారబడి తూగతుండాడు ఎంగిలోడు.

నేనూ ఇనోదూ దాంకోని వోడిమింద సిన్న సిన్న రాళ్లేసినాం. వోడు నిదర్లేసి మేం దాంకోనుండేటి పక్కకే సూడ జాగినాడు.

మేం, ఇహీ.. ఇహీ.. అని నవ్వాపుకుంటా బెమ్మజెఁవుడు పొదల సాట్నుంచి బైటికొచ్చి, దోరంగా నిల్సుకోని ఆ ఎంగిలోడ్ని ఎక్కిరిచ్చను మల్లుకున్నాం.

వోడేందో గొణిగినాడు..

యాందిరే తిడతుండావో, కక్కిరాయి దీస్కోని దెంగినాఁవనుకో నా సాదిగి సస్తావో అన్నాం మేం.

కళ్లింత జేసుకోని కోపంగా జూసినాడు,

వోడికి సేతులు ఏవాటానుంటాయో ఆవాటానే మా ఇద్దరి సేతుల్ని ముడుసుకోని, వోడెదురంగా జేరి నవ్వుకుంటా డ్యాన్సు జెయ్యను మల్లుకున్నాం నేనూ, ఇనోదూ.

వోడు మమ్మల్ని పట్టుకోని సావదెంగే దానికేఁవో, మాతొట్టు లగిచ్చినాడు. మేం దొరకతాఁవా..? అరస్తా నవ్వుకుంటా వోడికి సిక్కకుండా లగిచ్చేసినాం.

ఎప్పుడు, యాడ గనబడ్డా పిలకాయిలం అందురం వోడ్ని ఎక్కిరిస్తుంటాం. గమ్మన గొణుక్కుంటా ఎల్లిపొతాడు దప్పితే తిరగబడి ఎవుర్నీ యాఁవనడు, అట్టాట్టి ఈరోజేఁవిటికనో తరుంకున్నాడు.

దోరంగా లగిచ్చేసి ఎనిక్కి దిరిగి, రే ఎంగిల్నా కొడకా నీయమ్మన్దెంగా మమ్మల్నే తరుంకుంటా..? కుత్త బగల్దెంగతాం వుండో, అంటా అరిసినాం.

యాపసెట్టు కింద నిల్సుకోని సూస్తా వుండాడోడు.

మమ్మల్ని తరుంకోని బయిపెట్నందుకు ఎప్పుడో వొకతూరి ఎనికిట్నే

పొయ్యి కక్కిరాళ్లతో వోడ్ని సావదెంగేసి లగిస్తా ఎల్లిపోవాలని ప్లానేస్కున్నాం నేనూ, ఇనోదు.

•••

వొకనాటి నందేళ వనవల్ని ఇంటికి దోలకొచ్చి, రేతిరైనానక కూడెయ్యిచ్చుకొనే దానికి రాలేదోడు. సూసీ సూసీ రెడ్డెమ్మ బొయ్యి బిలిస్తే, గమ్మున లేసొచ్చి నేల జూపులు జూస్తా నిలబడ్డాడు. యాఁవిరా కూటికి రాలేదా..? అని అడిగినాది రెడ్డెమ్మ. యాంలేదుమా, ఆకల్లేదు అన్నాడు ఊపిర్లేనట్టు. యాఁవిటికి ఆకల్లేదో, యాఁవిటికట్టా ఉండావో..? ఎవురన్నా యాఁవన్నా అన్నారా అనడిగినాదా రెడ్డెమ్మ. మాయత్త కూతురు మంగికి పెళ్లి బెట్టుకున్నారంట మా.. అనిజెప్పి బొక్కు బొక్కున యాడవను మల్లుకున్నాడు. రెడ్డెమ్మ నిట్టూర్సి, నీ రాత యాందో నీకు తెలవదా..? ఇంకేఁవిటికిరా యేడ్సి బాదపడడఁవో, పో గిన్నిదేబో కూడేస్తా అన్నాది. వోడు గమ్మున కూడెయ్యిచ్చుకోని ఎల్లిపొయ్యాడు.

•••

తెల్లార్జాఁవన లేసి ఎప్పుట్లాగే పాలు బిండేదానికి సాల్లోకి బొయ్యింది రెడ్డెమ్మ. ఎంగిలోడు లేడాడ, రేతిరి గిన్నిలో యేసిన కూడు యేసినట్టే బడుండాది.

రొండుమూడు రోజులు గడిసినా ఆ ఎంగిలోడి జాడలేదు, అత్తకూతురి పెళ్లన్నాడు ఆ పెళ్ళికి గానీ బొయినాడా యాంద్యే..? అయినా సెప్పకుండా యాడకీ పోడే ఈడో అనుకుంటా వుండాదా రెడ్డెమ్మ.

తెల్ల తాఁవర పూలు బూసే వొంకినిగుంటలో సెపం దేలతుండాదని వొకనాటి పొద్దన్నే రచ్చబుట్టినాది మునికాంత పల్లిలో.

అందురూ లగిస్తుండారా గుంటకాడకి. పోలీసోళ్లొచ్చి యెట్టోళ్లని గుంటలోకి దింపినారు.

కుస్టు రోగంతో కాలేళ్లూ, సేతేళ్లూ సగానికి కొరక్క దినేసి, పెదేలు రొండూ బగిలిపొయ్యి, వొళ్లంతా ఆడాడా మచ్చలూ పుండ్లు పడి, ఇరబూసిన తెల్ల తాఁవర పూలు కాడల్తోగూడా వొంటికి సుట్టుకోనుండిన ఆ కుట్ర వొయిసు ఎంగిలోడి సెపాన్ని వొడ్డుకి లాక్కొచ్చినారా యెట్టోళ్లు.